# 20 ఏళ్లైనా

19
18
17
16
15
14
13
12
11
10
9
8
7
6
5
4
3
2
1

# ‘అంటరాని’ న్యాయమేనా !



ఎస్సీ ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం దుర్వినియోగం గురించి విన్నంతగా, చదివినంతగా దాని వినియోగం గురించి మీరెవరూ విని ఉండరు, చదివి ఉండరు.

ఇక నిరుపయోగం గురించైతే మీదాకా ఆ విషయాలేవీ వచ్చి ఉండకపోవచ్చు.

దీని అర్థం – ఈ చట్టం దుర్వినియోగం కాలేదని మేము అంటున్నామని కాదు. దుర్వినియోగం చేయడం తప్పు కాదంటున్నామనీ కాదు.

నిజాలు తెలియాలన్నా అపోహలు తొలగాలన్నా గత 20 ఏళ్లలో ఈ చట్టం తన ప్రకటిత లక్ష్యాన్ని ఎంతమేరకు సాధించగల్గిందన్న చర్చ, విశ్లేషణ అవసరం.

ఇది దళితులు ఉద్యమించి సాధించుకున్న చట్టం. శతాబ్దాల అవమానాలు, అత్యాచారాలు, నరమేధాలకు ప్రతిఫలంగా పొందిన ఒకానొక సామాజిక న్యాయహక్కు.

అగ్రకులాలు దళితుల పట్ల పాటించే 22 రకాల వివక్షలను గుర్తించి వాటిని తొలగించేందుకు, శిక్షించేందుకు భారత పార్లమెంటు రూపొందించిన చట్టం ఇది. దీని అమలుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ప్రతిపాదించడంతో పాటు నేరనిరోధానికి సైతం అత్యధిక ప్రాధాన్యాన్ని ఇవ్వమని చెపుతుందీ చట్టం. మరి పోలీసులూ, అధికారులూ దీనిపట్ల ఎలా వ్యవహరించారు? న్యాయస్థానాలు ప్రదర్శించిన వైఖరి ఏమిటి? దీని గురించి సామాజిక న్యాయాన్ని కోరేవారందరూ అడగవలసిన ప్రశ్నలెన్నో ఉన్నాయి. ఆందోళన చెందాల్సిన అంశాలెన్నో ఉన్నాయి.

ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వ యంత్రాంగానికి ఒట్టి చట్టపరమైన దృష్టి ఉంటే సరిపోదనేది అన్నిటికన్నా ముఖ్యంగా గుర్తించాల్సిన అంశం. కులమనే అసమ సామాజిక సంబంధాన్ని సమాజంలో విస్తృతంగా పాటిస్తారనే స్పృహ, దానికి అంతే విస్తృతమైన సామాజిక ఆమోదం ఉందనే గ్రహింపు, అగ్రకులాలు హింసాత్మకంగానైనా కులాధిపత్యాన్ని నిలబెడతాయనే గుర్తింపు పోలీసు కానిస్టేబుల్ నుండి ప్రధాన న్యాయమూర్తి దాకా అందరికీ ఉండడం అవసరం. నేరనిర్ధారణకే కాదు నేరనిరోధానికి కూడా ఇది అత్యంత అవసరం.

## పోలీసుల వైఖరి

ఈ నేరాలపట్ల పోలీసుల నిర్లక్ష్యం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. 25% కేసులను దర్యాప్తు క్రమంలోనే మూసివేస్తుండవచ్చుగాక, అయినా పోలీసుల చేత ఎఫ్ఐఆర్ కట్టించడం సామాన్యులకు సులభం కాదు. ఎఫ్ఐఆర్ కట్టడంవల్ల బాధితులకు ఒరిగేదేమీ లేదని తెలిసినా, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తేనో ప్రయివేటు కేసు వేస్తేనో ఆందోళన చేస్తేనోతప్ప ఎఫ్ఐఆర్ నమోదుగాని సందర్భాలు ఎన్నో. దాడిచేసిన వారిలో దళితులూ ఉన్నారని లేదా దాడి చేసిన వారికి కులపరమైన 'ఉద్దేశాలు' లేవని లేదా దాడి 'బహిరంగ' ప్రదేశాలలో జరగలేదు కాబట్టి కులవివక్షను ఆపాదించలేమని... ఇలా ఏదో ఒక కారణం చెప్పి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కాలయాపన చేయడం నిందితులకు ప్రయోజనం చేకూర్చడానికే. ఒకవేళ నమోదు చేసినా వాటిని ఐపిసి కింద కట్టడం లేదా కేసు తీవ్రతను తగ్గించడానికి, నీరు గార్చడానికి తప్పుడు సెక్షన్ల కింద కేసు రిజిస్టర్ చేయడం రివాజైపోయింది.

అంతే కాదు. బాధితులు నిందితుల మధ్య పంచాయితీలు చేసి రాజీలు కుదర్చడం, అది సాధ్యం కాకపోతే బాధితులను బెదిరించడం, కౌంటర్ కేసులు నమోదు చెయ్యడం, సామాజిక బహిష్కరణకు వీలు కల్పించి బాధితులను రాజీకి వచ్చేలా చేయడం, కేసు కట్టి నిందితులను అరెస్టు చేయడం అనివార్యమైతే హైకోర్టుకెళ్ళి ముందస్తు బెయిల్ తెచ్చుకోవడానికి అవకాశం కల్పించడం... ఎన్ని విధాలుగా వారిని బలహీనం చేయవచ్చో అన్నీ చేస్తున్నారు. ఒత్తిడి పెట్టి బాధితులకు నిందితులకు మధ్య రాజీ కుదర్చడం నిజానికి సెక్షన్ 4 కింద నేరంగా పరిగణించాల్సిన అవసరం వుంది. బాధితులకు అండగా నిలబడిన చోటైనా సరే, నిందితులకు ముందస్తు బెయిలు రాకుండా సమర్థవంతంగా ఎదుర్కొన్న సందర్భాలూ లేవు.

ఈ చట్టం క్రింద నమోదైన కేసుల దర్యాప్తును 30 రోజులలో పూర్తి చేయాలని నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. సామాజికంగా, ఆర్థికంగా బలహీనులైన దళితులు, ఆదివాసులు తమ మీద ఆధిపత్య కులాలు తెచ్చే ఒత్తిడిని తట్టుకోలేరని, కాబట్టి త్వరగా దర్యాప్తు పూర్తి చేసి విచారణ జరిపించాల్సిన అవసరం వుందని చట్టరూపకర్తలు భావించారు. అయినా బాధితుల గాయాలకు సంబంధించిన వైద్య నివేదికలు అందలేదని, సాక్షులు సహకరించడం లేదని, దర్యాప్తు అధికారైన డియస్పీకి తగినంత సమయం దొరకలేదనే సాకుతో కేసుల దర్యాప్తును సకాలంలో పూర్తి చేయడం లేదు. సాంకేతికమైన కారణాలకన్నా, నిందితులకు వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశమే ఇందులో ఎక్కువగా కనబడుతోంది. రాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు 15 వేల కేసులలో దర్యాప్తు నిర్దేశిత గడువులో అంటే – 30 రోజులలో పూర్తి కాలేదు. దరిదాపు వెయ్యి కేసులు మూడేళ్ళయినా చార్జిషీట్లు వేయక పెండింగ్‌లో వున్నాయి. ఏళ్ళ తరబడి కాలయాపన తర్వాత కూడా 50% కేసులలో మాత్రమే చార్జిషీట్ వేస్తున్నారు. ఈ లోపు విలువైన సాక్ష్యాధారాలు, న్యాయం కోసం పోరాడాలనే సంకల్పం మటుమాయం అవుతాయనే విషయం వేరే చెప్పనక్కరలేదు. ఈ వైఖరి ఫలితంగా మన రాష్ట్రంలో న్యాయస్థానం వరకు వస్తున్న వాటిలో కనిష్టంగా 6, గరిష్టంగా 15.9 శాతం కేసులలో మాత్రమే నిందితులకు శిక్షలు పడుతున్నాయి. దళితేతరుల మీద జరుగుతున్న నేరాలలో దేశ వ్యాప్తంగా 42% మందికి శిక్షలు పడుతున్నాయనే విషయాన్ని దృష్టిలో వుంచుకుంటే దళితుల పట్ల ఎంత దారుణమైన అన్యాయం జరుగుతూ వుందో అర్థం చేసుకోవచ్చు. అయినా ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం ఏమీ లేదని, ఉంటే గింటే తమ అసమర్థతే దీనికి కారణమని హైకోర్టు ముందు పోలీసు యంత్రాంగం నిస్సిగ్గుగా ఒప్పుకుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నక్సలైట్లను అణచడంలో దేశంలోనే సమర్థవంతమైన వ్యవస్థగా ప్రధాని నోట కీర్తించబడుతున్న మన పోలీసు వ్యవస్థకు చట్టబాహ్యమైన సమర్థత తప్ప, బలహీనులకు రక్షణ కల్పించే చట్టాన్ని అమలు చేసే నీతి లేదనుకోవాలి.

| ఎంత శ్రద్ధతో ఈ కేసులు నడిపిస్తున్నారో కింది పట్టిక చూస్తే తెలుస్తుంది | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| సం. | పాతకేసులు | కొత్తవి | మొత్తం | నిర్దోషులుగా విడుదల | శిక్షలు పడినవి | శిక్షల శాతం | బదిలీ చేసినవి | పెండింగ్‌లో వున్నవి |
| 2001 | 2090 | 1161 | 3251 | 733 | 61 | 7.5 | 23 | 2434 |
| 2002 | 2434 | 1131 | 3547 | 1014 | 66 | 6 | 0 | 2467 |
| 2003 | 2467 | 1558 | 4025 | 941 | 91 | 6 | 544 | 2449 |
| 2004 | 2449 | 1160 | 3609 | 1076 | 85 | 7 | 94 | 2354 |
| 2005 | 2362 | 3610 | 3610 | 1025 | 126 | 10.9 | 8 | 2251 |
| 2006 | 2251 | 3609 | 5860 | 1199 | 226 | 15.9 | – | 4369 |
| 2007 | 4369 | 1885 | 6254 | 1698 | 292 | 14.7 | – | 4247 |

## న్యాయస్థానాల వైఖరి

ఈ చట్టంలోని సెక్షన్ 14 ప్రకారం ఈ నేరాలపై విచారణకు ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక న్యాయస్థానాన్ని, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఏర్పాటు చేయాలి. ఇప్పటివరకు నమోదైన వేలాది కేసులలో ఒక్క చుండూరు కేసు విచారణకు మాత్రమే ప్రత్యేక కోర్టును, న్యాయవాదులను ప్రభుత్వం నియమించింది. అదీ ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు ఏళ్ళ తరబడి చేసిన పోరాట ఫలితంగా జరిగింది. మిగిలిన కేసుల విచారణకు ప్రాంతానికి ఒక్కటి చొప్పున మూడిండిని మాత్రమే ప్రత్యేక న్యాయస్థానాలుగా ప్రభుత్వం ప్రకటించింది. అవి పేరుకే ప్రత్యేకమైనవి కానీ, మిగిలిన చట్టాల కింద నమోదైన కేసుల విచారణ కూడా చేస్తాయి. ఒత్తిడి పెట్టగా, పెట్టగా 2006 నాటికి ఇంకొక 12 జిల్లా అదనపు న్యాయస్థానాలను ఈ చట్టం కింద ప్రత్యేక న్యాయస్థానాలుగా ప్రకటించారు. దళితుల మీద జరిగే దాడులన్నిటిపై విచారణ జరిపి సత్వర న్యాయం అందించాలంటే ఏ ప్రత్యేకతలూ లేని ఈ న్యాయస్థానాలు సరిపోవని ప్రత్యేకంగా చెప్పాలా?

ఈ చట్టం కింద నమోదయ్యే కేసులను డియస్పీ స్థాయి అధికారులైతే నిష్పాక్షికంగా విచారిస్తారని చట్టరూపకర్తలు ఎందుకు భావించారో కానీ, దాన్ని అమలు చేయడంలో పోలీసు యంత్రాంగం, న్యాయస్థానాలు చాలా అన్యాయమైన పాత్రను పోషించాయి. మొదట ఈ నిబంధనను పెద్దగా పట్టించుకోకుండా ఎస్ఐలు సిఐలే దర్యాప్తు చేస్తుంటే – అభ్యంతరం పెట్టాల్సిన దళితులు మౌనంగా ఉండిపోయినా – డియస్పీలు చేయాల్సిన దర్యాప్తును క్రింది స్థాయి అధికారులు చేశారు కాబట్టి కేసులను కొట్టివేయాలని అగ్రకుల నిందితులే న్యాయస్థానాలకు వెళ్లారు! వీటికి హైకోర్టు చాలాసార్లు సానుకూలంగా స్పందించింది కూడా. డియస్పీలే దర్యాప్తు చేయాలనే రూలు 7ను తప్పకుండా పాటించాలని తీర్పిచ్చిన హైకోర్టు నిజానికి దానిని అగ్రకుల నిందితులకు పూరట ఇవ్వడానికి చెప్పిందే తప్ప ప్రభుత్వం దానిని పాటించకపోవడంవల్ల న్యాయం పాతరేయబడుతోందని భావించి కాదు. ఈ తీర్పు వచ్చిన 3 ఏళ్ళకుగాని (2005 లో) ప్రభుత్వం ఆ నియమాన్ని తప్పనిసరిగా పాటించమని చెపుతూ జీవో విడుదల చేయలేదు. అందులోనూ ప్రతి కేసుకు ప్రత్యేకంగా ఒక డియస్పీని కేటాయించటానికి సంబంధిత పోలీసుస్టేషన్ అధికారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అన్నదే తప్ప, ప్రతి డియస్పీ స్థాయి అధికారి పరిధిలో జరిగే నేరాలు ఆటోమేటిగ్గా ఆ అధికారి పరిధిలోకి వస్తాయని చెప్పలేదు. కేసుల పూర్వాపరాలను పరిశీలించి జాగ్రత్తగా దర్యాప్తు జరిపే అధికారిని నియమించడం కోసం పెట్టిన నిబంధనను ఈ విధంగా వక్రీకరించి, ప్రతి కేసుకూ ఎప్పటికప్పుడు కొత్తగా దర్యాప్తు అధికారిని నియమించాల్సిన అవసరాన్ని కల్పించింది. నిష్పక్షపాతంగా విచారణ జరగడానికి ఉద్దేశించిన రూలును కేసుల దర్యాప్తును సాగదీయడానికి వాడుకొనే వైఖరి ఇది. చివరకు న్యాయస్థానంలో విచారణ వరకు వచ్చినా, హైకోర్టులో అగ్రకులాలు సులభంగా స్టే తెచ్చుకుంటున్నాయి. ఆ తర్వాత ఏళ్ళు గడిచినా ఆ స్టేను వెకేట్ చేయించడానికి ప్రభుత్వం ఏ మాత్రం ప్రయత్నించడం లేదు. అలా వందల కేసుల్లో విచారణ ముందుకు సాగకుండా హైకోర్టు అడ్డుపడుతూ వుంది. చుండూరు కేసునే 18 ఏళ్ళు విచారణ పూర్తిగాకుండా అగ్రకులస్థులు అడ్డుకోగలిగారంటే, ఇక మిగిలిన కేసులలో ప్రభుత్వ చిత్తశుద్ధి గురించి చెప్పేదేముంది? ఇదంతా చూస్తే, దళితులపై నేరాలకు పాల్పడినవారిని శిక్షించే ఉద్దేశం, బాధితుల హక్కుల్ని కాపాడే ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్టే కనిపిస్తోందా?

## సంక్షేమశాఖ ఏం చేస్తోంది?

ఈ చట్టం అమలుకు ఏ ఒక్కరూ బాధ్యత వహించినట్టు కనిపించదు. దీని అమలును పర్యవేక్షించే బాధ్యతను న్యాయానికి సాంఘిక సంక్షేమశాఖ చేపట్టి వుండాలి. దళితులకు పరిహారాన్ని అందించడానికి 1996లో ఒక జీవో, మండల కేంద్రాలకు రెవెన్యూ అధికారులు వెళ్ళి ప్రతినెలా 30 వ తారీఖున పౌరహక్కుల దినం జరపాలంటూ 2001లో ఒక సర్క్యులర్, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడాదికి ఒక సాంఘిక సంక్షేమ సదస్సు నిర్వహించాలని 2006లో మరో జీవో విడుదల చేసి అది చేతులు దులుపుకుంది. బాధితులు నష్టపరిహారం పొందే విషయంలో పడుతున్న ఇబ్బందులను గమనించి వాటిని సులభతరం చేయాలనే ఆలోచనే లేదు వాళ్లకు. ఈ చట్టం గురించి ప్రజలలో, ముఖ్యంగా ఆధిపత్య వర్గాలలో వాళ్లు విస్తృత ప్రచారం కల్పించాలి. ప్రభుత్వ యంత్రాంగానికి సరైన శిక్షణ ఇప్పించడంతోపాటు దీన్ని చిత్తశుద్ధితో అమలు చేయడానికి అవసరమైన సంసిద్ధతను వాళ్లలో కల్పించాల్సిన బాధ్యత కూడా ఈ శాఖదే.

ఈ చట్టం అమలుకోసం ఒక రాష్ట్రస్థాయి పర్యవేక్షక సంఘాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన 2005లో ఏర్పాటు చేశారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన ఈ సంఘం ఏనాడూ సక్రమంగా పనిచేయలేదు. జిల్లాలస్థాయిలో ఏర్పాటు కావాల్సిన విజిలెన్సు కమిటీలలో ఇటీవలి వరకు దళితులకు స్థానం లేదు. అమలులో ఇంత నిర్లక్ష్యానికి గురౌతున్న ఈ చట్టం గురించి దుర్వినియోగమౌతుందనే ప్రచారం మాత్రం ఆకాశాన్నంటుతూ వుంది.

గ్రామాలలో దళితుల మీద, ఆదివాసుల మీద దాడులను, వివక్షను ప్రోత్సహించే పెత్తందారీ వర్గాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు రాజకీయ, ఆర్థిక చర్యలను చేపట్టడం ద్వారా మాత్రమే వారి దౌర్జన్యాలను ప్రభుత్వం అదుపు చేయగలదు. సర్పంచ్‌లుగా సివిల్ కాంట్రాక్టర్లుగా ఊర్లలో పెత్తనం చేస్తూ, అగ్రకులాలను సమీకరించి దళితులమీద అణచివేతను కొనసాగించే వారి మీద ఉమ్మడిగా చర్యలు తీసుకోడానికి కూడా చట్టంలో వీలు వుంది. కానీ వాటిని అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించడం లేదు. పెత్తందార్లను బలహీనపర్చకపోతే పోనీ, కనీసం వారి అణచివేతను ఎదుర్కోవడానికి కావల్సిన ఆత్మస్థైర్యాన్ని కలిగించడానికి దళితులను, ఆదివాసులను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చెయ్యాల్సిన చర్యలు కూడా తీసుకోవడం లేదు. సరైన విద్యా, వైద్య సౌకర్యాలు కలిగించి, భూసంస్కరణల ద్వారా, ఉద్యోగావకాశాల ద్వారా వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తే ఈ చట్టాన్ని కొంతవరకైనా ఉపయోగించుకునే శక్తి వారికి వస్తుంది. దళితుల మీద దాడులు ఎక్కువగా కర్నూలు, మహబూబ్‌నగర్, శ్రీకాకుళం, నెల్లూరు, రంగారెడ్డి జిల్లాలలో జరుగుతున్నప్పటికీ, వివక్షను మాత్రమే ఎదుర్కొంటున్న హైదరాబాద్, సైబారాబాద్‌లలో దళితులు ఎక్కువ కేసులు నమోదు చేయగల్గుతున్నారంటే దానికి కారణం అక్కడివారికి ఆ శక్తి ఉండడమే.

ఈ చర్యలేమీ తీసుకోకుండా చట్టం అమలు బాధ్యతను పూర్తిగా ఆధిపత్య వర్గాలు తిష్ట వేసుకున్న ప్రభుత్వ యంత్రాంగానికే వదిలేస్తే, చట్టం ఆశించిన ఫలితాలు ఏనాటికీ రావు.

చివరిగా – దళితులు, స్త్రీలపైన జరిగే అత్యాచారాల విషయంలో బాధితులే రాజీపడి ఆందోళన వద్దనుకోవడం తరచుగా ఎదురవుతున్న బాధాకరమైన పరిస్థితి. న్యాయాన్యాయాలతో నిమిత్తం లేకుండా రాజీ చేయించడమే కర్తవ్యంగా పెట్టుకున్నవాళ్లు సమాజంలో చాలామంది ఉన్నారు. కొందరు తమ రాజకీయ ప్రయోజనాల కోసం, కొందరు ఆర్థిక ప్రయోజనాల కోసం ఈ పని చేస్తున్నారు. ఇందులో గ్రామపెద్దల నుంచి రాజకీయ నాయకులదాకా, కులపెద్దల నుంచి ప్రజాసంఘాల నాయకులుగా చెలామణి అయ్యేవారిదాకా పలురకాలవారు ఉన్నారు. ఇది దళితులకు ఎంత నష్టం చేస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేకపోయినా ఈ ప్రమాదకర ధోరణులపట్ల వారు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎవరి చేతుల్లోనూ పావులుగా మారకుండా జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాం.

దళితుల హక్కుల పట్ల నిబద్ధత ఉన్న ప్రజాసంఘాలు, న్యాయవాదులు దీర్ఘకాలం చేసిన పోరాటం వల్ల మాత్రమే 18 ఏళ్ళ తర్వాతనైనా చుండూరు అగ్రకులాలకు శిక్షలు పడ్డాయి. ప్రతి దాడి, వివక్ష విషయంలోనూ అదే స్థాయిలో పోరాటం, ఉద్యమం చేసి ఈ చట్టాన్ని అమలు చేయించుకోవడానికి కలిసి రమ్మని పిలుపునిస్తూ...

**మానవహక్కుల వేదిక**

**1-3-2010** **Human Rights Forum (HRF)**

---

*ప్రచురణకర్తలు : వి.ఎస్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి :9440411899 / ఎస్. జీవన్‌కుమార్ : అధ్యక్షులు : 9848986286*